రాత్రి వేళల్లో పోలీసుల నిఘా ఉండాలి



రోగులను కాపాడాలన్న ఉద్దేశంతో సేవలందించే వైద్యులు, సిబ్బందిపై దాడులను అరికట్టి రక్షణ కల్పించాలి. వైద్యశాలలకు వచ్చే రోగులు, సహాయకులు సిబ్బందిపై దాడులు చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పించాలి. వైద్యశాల ప్రాంతం మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండాలి. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌తో పోలీసుల నిఘా ఉండేలా చూడాలి.

–చావలి రామలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యురాలు, భట్టిప్రోలు

కఠిన చట్టాలు తేవాలి



నిస్వార్థ సేవ అందిస్తూ ప్రజల ప్రాణాలు కాపాడుతున్న వైద్యులు, వైద్య సిబ్బందికి కనీస భద్రత కల్పించడం ప్రభుత్వంతో పాటు ప్రజలూ బాధ్యతగా తీసుకోవాలి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఘటన మనసును కలచి వేసే అత్యంత పాశవిక చర్య. నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలను తీసుకురావాలి.

– డాక్టర్ జీవనలత, మెడికల్ ఆఫీసర్, కనగాల పీహెచ్‌సీ, రేపల్లె

క్లుప్తంగా

వరిగడ్డి వాము దగ్ధం



కొల్లూరు: వరిగడ్డి వాము దగ్ధమైన ఘటన మండలంలోని క్రాపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొక్కిలిగడ్డ లక్ష్మయ్య గృహానికి సమీపంలోని వరిగడ్డి వాము నుంచి శనివారం తెల్లవారుజామున మంటలు ఎగసిపడ్డాయి. ఇది గమనించిన లక్ష్మయ్యతో పాటు స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. కానీ, రూ.40 వేలు విలువ చేసే అయిదున్నర ఎకరాల గడ్డివాము అప్పటికే దగ్ధమైంది. బాధితుడు లక్ష్మయ్య స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆడపిల్లల రక్షణ సామాజిక బాధ్యత



కొల్లూరు: ఆడపిల్లలపై జరుగుతున్న అరాచకాలను అరికట్టడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఐసీడీఎస్ దోనేపూడి సెక్టార్ సూపర్‌వైజర్ పి.నగరాజకుమారి అన్నారు. శనివారం మండలంలోని జువ్వలపాలెంలో బేటీ బచావో – బేటీ పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి కుటుంబంలోని ఆడపిల్లలను తప్పనిసరిగా చదివించి, వారిని రక్షించాలన్నారు. 18 ఏళ్ల వయస్సు నిండిన అనంతరమే వివాహం జరిపించాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానికులకు చేతులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఏఎన్ఎం జి.పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ రాఘవశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు కె. నిర్మలాదేవి, బి.అనురాధ, సీహెచ్ జలజ, ఎంఎస్ జ్యోతి పాల్గొన్నారు.

సూక్ష్మపోషకాలపై రైతులకు అవగాహన



మోదుకూరు(వేమూరు): వరి పంటలో ఎరువుల యాజమాన్యం, సూక్ష్మ పోషకాల ఆవశ్యకతను జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అక్తర్ హుస్సేన్ వివరించారు. చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో ఆత్మ సౌజన్యంతో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ మాట్లాడుతూ.. వరి పైరుని ఆశించిన ఆకు ముడత, దుబ్బు దోమ, ఉల్లి కోడును సమర్థంగా నిర్మూలించడానికి సస్య రక్షణ చర్యలు వివరించారు. రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులనకు అనుగుణంగా సాగు పద్ధతులు పాటించాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి బి.ఆడంబాబు మాట్లాడుతూ రైతులు తప్పకుండా పంట నమోదు చేయించుకుని, ఈకేవైసీ చేయించాలన్నారు. ప్రకృతి వ్యవసాయాధికారి కన్యా కుమారి దశ పర్ని కషాయం తయారీ విధానాన్ని వివరించారు.

ఆర్థిక సాయం అందజేత



పేరలి(కర్లపాలెం): కర్లపాలెం పోస్టాఫీసులో ప్యాకర్‌గా పనిచేస్తూ శ్రీనివాసరావు ప్రజలకు మెరుగైన సేవలందించారని ఓబీసీ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రాధాకృష్ణ అన్నారు. ప్యాకర్ పోతార్లంక శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో తెనాలి ఓబీసీ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అతని కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అసోసియేషన్ సభ్యులు వెంకటేశ్వరరావు, నరేంద్ర, సాయిప్రసాద్, గోపీ, సుబ్బారావు, లక్ష్మణ్, కుమారస్వామి, జ్యోతి, మమత, ఆశాబీ ఉన్నారు.

గతి తప్పిన ఖరీఫ్ సాగు

- కాల్వలకు లేని సాగు నీరు పారుదల
- నెర్రులు తీస్తున్న వరి పొలాలు
- ఆయిల్ ఇంజన్లతో నీటి మళ్లింపునకు అష్టకష్టాలు
- ప్రశ్నార్థకమైన పంట రక్షణ



వేమూరు మండలంలోని బలిజేపల్లి రైలు గేటు వద్ద బీటలు వారిన వరి పొలం



కొల్లూరు: చినపులివర్రులో కాల్వ నీరు ఆయిల్ ఇంజన్లతో మళ్లింపు

కొల్లూరు: డెల్టా ప్రాంతంలో ఖరీఫ్ సాగు చక్రం గతి తప్పింది. నాట్లు వేసిన వరి పొలాలు బీటలు వారుతున్నాయి. సాగు నీటి కాలువల ద్వారా పొలాలకు నీరు అందకపోవడం, వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్‌లో వరి పంట మొలక దశలోనే ఎండిపోతోంది. గత మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై మబ్బులు కమ్ముతోంది. వరుణుడు కరుణించిక పోతాడా.. వరి పంటను కాపాడకపోతాడా.. అన్న ఆశతో ఎదురు చూస్తున్న రైతులకు నిరాశే పలకరిస్తోంది. కంటికి రెప్పలా కాపాడుకున్న పంట కళ్లెదుటే ఎండుముఖం పడుతుంటే కర్షకులు తట్టుకోలేక పోతున్నారు. కష్టనష్టాలకోర్చి ఆయిల్ ఇంజన్లు, విద్యుత్తు మోటార్లతో నీటిని పంటకు మళ్లిస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరిగి పంటకు పెట్టిన నీరు పెట్టినట్లు ఇంకిపోతూ.. వెద, నాటు పద్ధతుల్లో సాగు చేసిన వరి పొలాలు నెర్రులు తీస్తున్నాయి. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని పశ్చిమ బ్యాంక్ కెనాల్ కింద సాగులో ఉన్న 1.55 లక్షల ఎకరాల్లో సాధారణంగా జులై ఆఖరు, ఆగస్టు మొదటి వారంలో వరి నాట్లు పూర్తవ్వాల్సి ఉంది. సాగు నీటి లభ్యత తగ్గడం, వర్షాలు కురవకపోవడంతో సగం పొలాలు ఇప్పటి వరకు వరి నాట్లకు నోచుకోలేదు. ఈ జాప్యంతో రబీ సాగు ఆలస్యమవడంతోపాటు, రెండు పంటల దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. కొల్లూరు, వేమూరు, భట్టిప్రోలు, అమృతలూరు, రేపల్లె, చెరుకుపల్లి, చుండూరు తదితర మండలాల్లో నీటి ఎద్దడి వల్ల పంటలు ఎండిపోతున్నాయి.



చినపులివర్రు సమీపంలో నీరందక ఎండిపోతున్న వరి పైరు



ద్విచక్ర వాహనంతో అద్దె ఇంజిన్ తరలింపు



కొల్లూరు: క్రాప మార్గంలో పంటకు నీరు వెళ్లకపోవడంతో టార్పాలిన్‌లతో అడ్డుకట్ట

29న అష్టకుండాత్మక లక్ష్మీ కుబేర హోమార్చన

బాపట్ల: ఈ నెల 29న అష్టకుండాత్మక లక్ష్మీ కుబేర హోమార్చన నిర్వహించనున్నట్లు శ్రీ లలితా త్రిపుర సుందరీ పీఠం నిర్వాహకులు నెమలి కంటి హనుమంతరావు తెలిపారు. శ్రావణ మాసం, ఏకాదశి, ఆరుద్ర నక్షత్రం గురువారంతో కలిసి వచ్చినట్లు పేర్కొన్నారు. చీలు రోడ్డులోని శ్రీ పాండురంగ స్వామి దేవాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తునట్లు వెల్లడించారు. పుష్పార్చన, కుంకుమార్చన, అష్టాదశ నైవేద్యాలు ఉంటాయని వివరించారు. పూజల్లో పాల్గొనే భక్తులు మంగళవారం లోపు గోత్ర నామాలు, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు రొంపిచర్ల కేశవాచార్యులు 73864 44371, మేడూరి వెంకట అప్పలాచార్యులు 93464 78011, నెమలికంటి హనుమంతరావు 97014 89906 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

27న శ్రీ కృష్ణ జయంతి వేడుకలు

భట్టిప్రోలు: మండల కేంద్రంలోని సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో ఈ నెల 27న శ్రీ కృష్ణ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బూర్లె అరుణ కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సహకారంతో గో పూజ, శ్రీ కృష్ణుడికి అభిషేకాలు, సంకీర్తన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం ఉట్టి మహోత్సవం, కోలాటం ఉంటుందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేమూరు: అత్యవసర మరమ్మతులు నిమిత్తం వేమూరు సబ్ స్టేషన్ 11 కేవీ కోడిపర్రు ఫీడర్ పరిధిలోని విద్యుత్ సరఫర ఆదివారం నిలిపివేస్తున్నట్లు ఏఈ గోపి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమూరు, వరహాపురం, బేతేలాపురం, బూతుమల్లి, బలిజేపల్లి, ముసలపాడు గ్రామాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. పంట పోలాల్లో విద్యుత్ లేన్ల మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు.

రైలు కింద పడి మహిళ మృతి

బాపట్లటౌన్: రైలు కిందపడి మహిళ మృతి చెందిన ఘటన పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. మండలంలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన ద్వారం నాగేంద్రమ్మ (62) చిన్నగంజాంలోని తమ బంధువుల ఇంటికెళ్లి విజయవాడ పాసింజర్ రైలులో బాపట్లలో దిగారు. 3వ నంబరు ప్లాట్‌ఫామ్ నుంచి ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్‌కు వచ్చేందుకు పట్టాలు దాటుతుండగా అదే సమయంలో విజయవాడ నుంచి చెన్నై వెళ్లే జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొట్టింది. ఈ ఘటనలో నాగేంద్రమ్మ మృతిచెందింది. రైల్వే పోలీసులు కేసు నమోదుచేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

నేరాల నియంత్రణే పల్లె నిద్ర లక్ష్యం

బాపట్లటౌన్: నేరాల నియంత్రణే పల్లెనిద్ర లక్ష్యమని పోలీసు అధికారులు గ్రామాల ప్రజలకు చెప్పారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు.. శనివారం సాయంత్రం జిల్లాలోని పోలీస్ అధికారులు గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ వారితో మాట్లాడారు. పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, ఫ్రెండ్లీ పోలీస్ సింగ్ ను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలను తెలుసుకొని, పరిష్కరించాలని చెప్పారు. ప్రజలతో మమేకమై.. అసాంఘిక కార్యకలాపాల సమాచారం సేకరించేందుకు పల్లె నిద్రతో అవకాశం ఉంటుందన్నారు. కొత్త వ్యక్తుల కదలికలను ఎప్పటికప్పుడు పోలీస్ శాఖకు తెలియజేసే విధంగా గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ చందోలు గ్రామంలోని హరిజనవాడలో, చీరాల డీఎస్పీ పి.జగదీష్ నాయక్ రామాపురం గ్రామంలో సీఐలు, ఎస్ఐలు వారి ప్రాంతాల్లోని గ్రామాల్లో, వార్డుల్లో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు.



చందోలు హరిజనవాడ వాసులతో మాట్లాడుతున్న ఏఎస్పీ టి.పి. విఠలేశ్వర్

ట్రాక్టర్ల విషయాన్ని తప్పుదోవ పట్టిస్తున్న కార్యదర్శి

వైఎస్సార్ సీపీ నాయకులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ పంచాయతీలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు మంజూరైన ట్రాక్టర్ల విషయాన్ని కార్యదర్శి కోట శ్రీనివాసరావు తప్పుదోవ పట్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు సిరాజుద్దీన్ ఆరోపించారు. శనివారం పార్టీ పట్టణ అధ్యక్షుడు కుందేటి రమేష్, ఎంపీటీసీ కొతరపు పద్మావతి, పంచాయతీ వార్డు సభ్యులు పెరికల శ్యామ్ సుందర్, వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీకి ట్రాక్టర్లకు సంబంధం లేదని, ఎలాంటి చెల్లింపులు జరగలేదని కార్యదర్శి పేర్కొనడం విడ్డూరంగా ఉందని అన్నారు. పారిశుద్ధ్యం నిమిత్తం రెండు ట్రాక్టర్లు, రెండు ట్రాలీలు మంజూరు చేయించి పంచాయతీ తీర్మానంతో రిజిస్టర్ చేసి అందజేయడం జరిగిందని తెలిపారు. 14వ ఆర్థిక సంఘం నుంచి కూడా బకాయిలు చెల్లిస్తామని కూడా అందులో పేర్కొన్నట్లు చెప్పారు. లబ్ధిదారులు నగదు చెల్లించడానికి కార్పొరేషన్‌కు వెళితే పట్టించుకోలేదని చెప్పడం విడ్డూరమన్నారు. ఎవరైనా బకాయిలు చెల్లిస్తామంటే ఎందుకు కట్టించుకోరని ప్రశ్నించారు. పంచాయతీకి జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారో చెప్పాలన్నారు. పంచాయతీలో ఉండాల్సిన ట్రాక్టర్లు ఎలా బయటకు వెళ్లాయో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి ఎటువంటి పరిశీలన చేయకుండా పత్రికా ప్రకటన ఇచ్చారన్నారు. నిశాని సర్పంచులను అడ్డం పెట్టుకుని పంచాయతీ వ్యవహారాలను తూనుగుంట్ల సాయిబాబా నడపడం ఆనవాయితీగా వస్తోందన్నార నాయకులు కుక్కల భూషణరావు, కుక్కల వెంకట్రామయ్య, కొలుసు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు

విద్యా రుణం అందజేత

భట్టిప్రోలు: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఈ ఏడాది ప్రవేశ పెట్టిన విద్యా నిధి పథకం ద్వారా ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు రూ.25 వేలు వడ్డీ లేని రుణం అందిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు బి.సుబ్బారావు, సెక్రటరీ కొత్త నాగ వెంకట రవితేజ తెలిపారు. శనివారం స్థానిక రథం సెంటర్‌లోని శ్రీ వేణుగోపాల స్వామి ఆవరణలోని శ్రీ సాయికృష్ణ కళా వేదిక వద్ద ఆరుగురు విద్యార్థులకు రూ.25 వేలు చొప్పున రూ.1.50 లక్షల నగదు చెక్కులు అందజేశారు. శనగపల్లి హరిణి, అద్దేపల్లి దినేష్, కనికిచర్ల ధార్మిక, మానేపల్లి ఉజ్వల, బొమ్మిశెట్టి షాగుణ్య, తూనుగుంట్ల తనూజకు ఈ ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ కో–ఆర్డినేటర్లు ఎన్.నాగభూషణ, సీహెచ్‌వీ ఉమా మహేశ్వరరావు, ఆర్‌సీలు కె.రవికుమార్, ఎస్ఎస్‌పీ గుప్తా, బొలిశెట్టి శ్రీనివాసరావు, బూర్లె రామప్రసాద్, చార్టెర్డ్ ప్రెసిడెంట్ టి.వెంకటేశ్వరగుప్తా, ఎంఎం వెంకటేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, ఎం.సాంబ శివరావు, కోశాధికారి బీవీ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.



నగదు చెక్కులు అందుకున్న విద్యార్థులతో వాసవి క్లబ్ నిర్వాహకులు

విద్యార్థి దశ నుంచే పోటీతత్వం



బహుమతులు అందజేసిన ఎంఈవో నిరంజన్

బాపట్లటౌన్: విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఎంఈవో ఎస్.నిరంజన్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సదర్భంగా పట్టణంలోని సర్ సీవీ రామన్ సైన్స్ క్లబ్‌లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శనివారం ఎంఈఓ కార్యాలయం ప్రాంగణంలో బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవో ఎస్.నిరంజన్ విద్యార్థులను ప్రొత్సహించి పోటీల్లో పాల్గొనేలా చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఎంఈవో–2 ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణాకెనాల్ రైల్వే గేట్ వద్ద గుర్తు తెలియని మృతదేహం

లక్ష్మీపురం: కృష్ణాకెనాల్ రైల్వే గేట్ సమీపంలో శనివారం మధ్యాహ్నం ఒక గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. రైల్వే జీఆర్పీ సీఐ అంజిబాబు తెలిపిన వివరాలు.. కృష్ణాకెనాల్ రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. రైలు నుంచి జారీ పడినట్లు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాక పోవడంతో గుర్తు తెలియని మృతదేహం కింద కేసు నమోదు చేసి ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. మృతుడు బిస్కెట్ కలర్ ఫ్యాంటు, లైట్ స్కై బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్ ధరించి ఉన్నట్లు వివరించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9440627546, 9550523485 నెంబరులలో సంప్రదించాలని కోరారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు

పట్నంబజారు: రిజిస్ట్రేషన్ కార్యాలయంలోకి వెళ్లి డాక్యుమెంట్లు చించి, అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. డొంకరోడ్డుకు చెందిన లింగయ్యకి ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు శ్రీరామమూర్తికి తన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించేందుకు శనివారం సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి వచ్చారు. దీంతో మిగిలిన ఇద్దరు సుధాకర్, అంకయ్య ఆస్తిని పెద్ద కుమారుడికి ఎలా రాస్తావంటూ రిజిస్ట్రరు కార్యాలయంలోకి ప్రవేశించి కాగితాలు చించి వేసి అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. జాయింట్ రిజిస్ట్రారు –1 ఎం.విజయప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నిజాంపట్నం: మండలంలోని అడవులదీవి పంచాయతీ గుణ్ణంతిప్ప గ్రామంలోని చెరువుల సమీపంలో శనివారం గుర్తుతెలియని మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వీఆర్వో సుధాకరరావు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహంపై ఎరుపు, నలుపు, బులుగు రంగు అడ్డ చారల టీషర్ట్, లోయర్ ఫ్యాంటు ఉంది. నలుపు రంగు కలిగి, సుమారు ఐదు అడుగుల ఎత్తు ఉన్నాడని చెప్పారు. సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని పేర్కొన్నారు. బంధువులు ఎవరైనా ఉంటే అడవులదీవి పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. మృతికిగల కారణాలు తెలియరావాల్సి ఉందని పోలీసులు తెలిపారు.



ముప్పై ట్రాక్టర్లు.. లంక గ్రామాలే దారులు



చినపులివర్రు రోడ్డు నుంచి పెనుమర్రు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లు

వేమూరు: కొల్లూరు మండలంలోని లంక గ్రామాల నుంచి రోజూ 30 ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. రాత్రిళ్లు ఇసుక ట్రాక్టర్లు నిల్వ చేసి, తెల్లవారు జామున కొల్లూరు కరకట్ట మీదగా దోనేపూడి, కోటిపల్లి, చినపులివర్రు, పెనుమర్రు, కోడిపర్రు, చావలి గ్రామాల ద్వారా అమర్తలూ రు, చుండూరు మండలాలకు ఇసుక తరలిస్తున్నారు. గత ప్రభుత్వంలో సెబ్ అధికారులు అక్రమ ఇసుక ట్రాక్టర్లు పట్టుకొని, కేసులు నమోదు చేశారు. కూటమి ప్రభు త్వంలో నాయకులు ఇసుక అక్రమంగా తరలిస్తున్నా..పట్టించుకోవడం లేదు. అటు వైపు కూడా కన్నెత్తి చూడటం లేదు. సెబ్ అధికారులకు అక్రమార్కుల నుంచి డబ్బులు ముడుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. అందువల్లే అధికారులు తమకు ఏమీ తెలీయనట్లు ఉంటున్నారని ఆరోపణలున్నాయి. దీనిపై సెబ్ ఇన్‌చార్జి సీఐ గంగాధర్ స్పందిస్తూ.. ఇసుక తరలిస్తున్న ట్రాకర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. వాటిని పట్టుకొని, కేసు నమోదు చేస్తామని చెప్పారు.

• ఒరిగిన స్తంభం పడితే..!

రేపల్లె రూరల్: మండలంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు ప్రమాద భరితంగా ఉన్నాయి. కాలం చెల్లి పలుచోట్ల ఒరిగి ఉన్నాయి. విశ్వేశ్వరం నుంచి గంగడిపాలెం వరకు కరకట్ట పక్క దారిలో పలు విద్యుత్ స్థంబాలు ప్రమాదభరితంగా మారాయి. నల్లూరు నార్త్, తుమ్మల, పోటుమెరక గ్రామాలకు వెళ్లే రహదారుల్లోనూ విద్యుత్ స్తంభాలు ఒరిగాయి. నేలవాలేందుకు సిద్ధంగా స్తంభాలతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలను సరి చేయాలని కోరుతున్నారు.



విశ్వేశ్వరం – పిరాట్లంక ప్రధాన రహదారిలో ఇలా

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్ (SAMB-II), హైదరాబాద్
1వ అంతస్తు, డి.నం.3-4-1013/A, 1వ అంతస్తు, CAC, TSRTC బస్‌స్టేషన్, కాచిగూడ, హైదరాబాద్.
టెలిఫోన్: 040-23147100 నుండి 23147107, ఇ-మెయిల్ ఐడి: sbi.18359@sbi.co.in

అధీకృత అధికారి వివరాలు: పేరు: శ్రీ రవిశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్
ఇ-మెయిల్ ఐడి: sbi.18359@sbi.co.in, మొబైల్ నం: 9704999825, ల్యాండ్‌లైన్ నం. (ఆఫీస్): 040-23147107

అనుబంధం – IV A (రూల్ 8 (6) మరియు 9(1)కి నిబంధనలు చూడండి)
ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) మరియు 9(1)కి నిబంధనలతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద బ్యాంకుకు ఛార్జ్‌చేసిన/ తనఖాపెట్టిన స్థిరాస్తుల అమ్మకం.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ ఛార్జ్‌చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మక స్వాధీనంలోకి తీసుకోబడినవని, అవి మెసర్స్ సుప్రీమ టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఇంతకుముందు మెసర్స్ GSR టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్) యొక్క గ్యారంటార్లు: 1) శ్రీ అన్నె నరేంద్ర కుమార్, 2) శ్రీమతి అన్నె హేమ సుధారాణి, 3) శ్రీ జి. శ్రీనివాస రావు, 4) శ్రీమతి గుంటుపల్లి పద్మజ, 5) శ్రీమతి గుంటుపల్లి పద్మావతి, 6) శ్రీ ఎస్. వేణుగోపాల్ రావు మరియు 7) శ్రీ గుంటుపల్లి నాగ రాఘవేంద్రరావు వారి నుండి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించవలసిన బకాయి 16.10.2019 నాటికి మొత్తం రూ.22,36,92,734.64/-(ఇరవై రెండు కోట్ల ముప్పై ఆరు లక్షల తొంభై రెండు వేల ఏడు వందల ముప్పై నాలుగు రూపాయల అరవై నాలుగు పైసలు మాత్రమే) + 17.10.2019 నుండి కాంట్రాక్చువల్ రేటు వంతున వడ్డీతో పాటు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ॥వి రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే", "ఉన్నవి ఉన్నట్లుగా" మరియు "అక్కడ ఏమున్నవో అవే" ప్రాతిపదికన 18.09.2024న విక్రయించబడునని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత/గ్యారంటార్లు/తనఖాదారులకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

స్థిరాస్తుల వివరణ, రిజర్వు ధర, డిపాజిట్ చేయవలసిన బయానా, వేలం తేది మరియు సమయాలు మరియు బిడ్ ఇంక్రిమెంట్ మొత్తాలు దిగువ పేర్కొనబడినవి:

ఆస్తి ఐడి:
A) డాక్యుమెంట్ నం.2946/2011 తేది:06-04-2011 ప్రకారం నమోదైన శ్రీ అన్నె నరేంద్ర కుమార్‌కు చెందిన, గుంటూరు జిల్లా, నరసరావుపేట రెవెన్యూ డివిజన్, చిలకలూరిపేట ఉప జిల్లా, చిలకలూరిపేట మున్సిపాలిటీ, పురుషోత్తంపట్నం గ్రామం వద్ద గల డి.నం.లు 384/1C & 384/1D కలిగిన ఎ.1.00 సెంట్లు లేదా 0.405 హెక్టార్ల విస్తీర్ణం గల మార్పు చేయబడిన భూమి యావత్తు మరియు సరిహద్దులు: ఉత్తరం: విడదల శివ భూమి, దక్షిణం: బైర నాగేశ్వరరావు భూమి, తూర్పు: బైర జయపతి భూమి, పశ్చిమం: అచ్చుకోల చెన్నకేశవులు భూమి.
B) డాక్యుమెంట్ నం.4490/2006 తేది:03-10-2006 ప్రకారం నమోదైన శ్రీ అన్నె నరేంద్ర కుమార్‌కు చెందిన, గుంటూరు జిల్లా, నరసరావుపేట రెవెన్యూ డివిజన్, చిలకలూరిపేట ఉప జిల్లా, చిలకలూరిపేట మున్సిపాలిటీ, పురుషోత్తంపట్నం గ్రామం వద్ద గల డి.నం.లు .383/2A, 383/2C1, 383/2C2 మరియు 383/2C3 కలిగిన ఎ.2.85 సెంట్ల విస్తీర్ణం గల మార్పు చేయబడిన భూమి యావత్తు మరియు సరిహద్దులు: ఉత్తరం: దేవిరెడ్డి రామచంద్రుడు మరియు తోట కోటేశ్వరరావు భూమి, దక్షిణం: అచ్చుకోల చెన్నకేశవులు మరియు ఇతరుల భూమి, తూర్పు: విడదల సాంబశివరావు మరియు ఇతరుల భూమి, పశ్చిమం: పొలిమేర డొంక.
(RDO నరసరావుపేట వద్ద నమోదైన ప్రొసీడింగ్స్ నం.D.Dis.7966/2013-A తేది: 14-11-2013 ప్రకారం మొత్తం ఎ.3.85 సెంట్ల భూమిలో ఎ.3.76 సెంట్ల వ్యవసాయ భూమి వ్యవసాయేతర భూమిగా మార్పుచేయబడింది).

రిజర్వు ధర: రూ.1,58,00,000/-; బయానా: రూ.15,80,000/-; బిడ్ ఇంక్రిమెంట్: రూ.1,00,000/-
వేలం తేది: 18.09.2024, వేలం సమయం: ఉ.11.00 గం. నుండి మ.12.00 గం.

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం:
03.09.2024 నుండి 04.09.2024 వరకు ఉ.11.00 గం. మరియు సా.4.00 గం. మధ్య ముందస్తు అపాయింట్‌మెంట్‌తో.

బయానా చెల్లింపు: బిడ్డర్లు తమ మొబైల్ నంబరు మరియు ఇ-మెయిల్ ఐడి ఉపయోగిస్తూ https://ebkray.in/ లో తమంతటతాము నమోదు చేసుకోవాలి e-KYCలో భాగంగా డాక్యుమెంట్లు సిస్టమ్ ద్వారా తనిఖీ చేయబడతాయి కాగోరు బిడ్డర్లు/ కొనుగోలుదార్లు వేలం సమయంలో/ తగినంత ముందుగా అతని గ్లోబల్ EMD వ్యాలెట్‌లో ఆన్‌లైన్ విధానం ఉపయోగిస్తూ (అనగా NEFT/Transfer/UPI/నెట్ బ్యాంకింగ్) బయానా మొత్తాన్ని బదిలీ చేయాలి. గ్లోబల్ EMD వ్యాలెట్‌లో బయానా మొత్తం అందుబాటులో లేనట్లయితే బిడ్ వేయుటకు సిస్టమ్ అనుమతించదు. రిజిస్ట్రేషన్, KYC డాక్యుమెంట్ల తనిఖీ మరియు వ్యాలెట్‌లో బయానా బదిలీని వేలానికి తగినంత ముందుగా పూర్తిచేయాలి. బిడ్డర్లు ఒకటి లేదా అన్ని ఆస్తులకు ఆఫర్లు ఇవ్వవచ్చును. అతని వ్యాలెట్‌లో తగినంత బయానా ఉన్నప్పుడు మాత్రమే ఆసక్తి గల బిడ్డరు ఇ-వేలం తేదీన బిడ్ వేయగలుగుతాడు. బిడ్డరు యొక్క గ్లోబల్ వ్యాలెట్‌లో బిడ్డింగ్ సమయంలో తగినంత మొత్తం (>=బయానా మొత్తం) ఉండాలి. ఒకటికంటే ఎక్కువ ఆస్తుల కొరకు ఆఫర్లు ఉన్నచో బిడ్డర్లు ఒక్కొక్క ఆస్తి కొరకు బయానా మొత్తం డిపాజిట్ చేయాలి.

1. అమ్మకం యొక్క ఇతర నిబంధనలకు సంబంధించి ఏవేని స్పష్టీకరణలు లేదా తదుపరి వివరాల కోసం కాగోరు బిడ్డర్లు అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్ట్రెస్డ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్-II, హైదరాబాద్-500027, ఫోన్ నం.040-29807107 వారిని సంప్రదించవచ్చును మరియు బ్యాంక్ ఆమోదిత రికవరీ ఏజెంట్ మెసర్స్ గుడ్‌విల్ అసోసియేట్స్, సెల్ నం. 9949901281 లేదా 9666247000 వారిని కూడా సంప్రదించవచ్చును మరియు బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ మెసర్స్ PSB Alliance, వెబ్ పోర్టల్ https://ebkray.in హెల్ప్‌లైన్ +91 8291220220, e-mail: support.ebkray@psballiance.com వారిని కూడా ఇ-వేలం తేది కంటే ముందుగా సంప్రదించవచ్చును.
2. అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ 1. https://bank.sbi/, www.sbi.co.in 2. https://ebkray.in/లో ఏర్పాటు చేసిన లింకును రిఫర్ చేయండి.
3. గమనిక: ఇ-వేలం తేదీకి ముందు బకాయిలను పూర్తిగా తిరిగి చెల్లించనట్లయితే పైన తెలిపిన తేదీన ఆస్తి యొక్క ఇ-వేలం అమ్మకాన్ని నిర్వహించుట గురించి సదరు రుణం యొక్క రుణగ్రహీత/ గ్యారంటార్లకు ఇది నోటీసుగా కూడా ఉంటుంది.
4. సదరు అమ్మకం సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద నిర్దేశించిన నియమాలు/ నిబంధనలకు లోబడి ఉంటుంది.

తేది: 19.08.2024
ప్రదేశం: హైదరాబాద్
సం/- అధీకృత అధికారి & AGM
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SAMB-II, హైదరాబాద్